నందిగామలో వ్యక్తి ఆత్మహత్య

రాజాపూర్, ఫిబ్రవరి 6: మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలం ముదిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కేతిరెడ్డిపల్లి చెన్నయ్య(45) మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ రవి తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నయ్య డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. పిల్లల చదువు నిమిత్తం జడ్చర్లలో ఉంటున్నారు. భార్యా పిల్లలు జడ్చర్లలో ఉండగా, సోమవారం ముదిరెడ్డిపల్లికి వచ్చాడు. అదే రోజు రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తలుపులు తీయకపోవడంతో గ్రామస్థులు పగులగొట్టి చూడగా ఫ్యానుకు వేలాడుతూ కనిపించాడు. అనంతరం భార్యకు సమాచారం ఇచ్చారు. భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తులో ఉంది.

కల సాకారమయ్యేనా?

గద్వాల-డోర్నకల్ రైల్వే లైన్‌కు ఫైనల్ లొకేషన్ సర్వే పూర్తి

- ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో నిధులు కేటాయించని కేంద్రం
- కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక మంజూరవుతాయనే ఆశలు
- పాత అలైన్‌మెంట్‌ను కూడా పూర్తి చేసేందుకు ప్రయత్నాలు
- ఈ ప్రాంతంలో రైలు మార్గం వస్తే వ్యాపారపరంగా అభివృద్ధి



వనపర్తి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): వనపర్తి, నాగర్‌కర్నూల్ ప్రజల చిరకాల కోరిక అయిన గద్వాల- డోర్నకల్ రైల్వేలైన్‌కు ఫైనల్ లొకేషన్ సర్వే పూర్తయ్యింది. కేంద్ర ప్రభుత్వం గత సంవత్సరం గద్వాల- మాచర్ల రైల్వేలైన్‌కు బదులుగా అలైన్‌మెంట్ మార్చి, గద్వాల- డోర్నకల్ రైల్వేలైన్ ఏర్పాటుకు ఫైనల్ లొకేషన్ సర్వే చేయాలని ఆదేశించింది. ఈ మేరకు సర్వే కోసం రూ.7.40 కోట్లు కేటాయించింది. ప్రస్తుతం ఆ సర్వే పూర్తికాగా, ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లోనే నిధులు కేటాయిస్తారని ఆశించారు. కానీ ఆమోదం లభించలేదు. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రవేశపెట్టిన బడ్జెట్ కావడంతో.. కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఈ లైన్‌కు కేంద్రం నిధులు మంజూరు చేయాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఇప్పటికే రైల్వే లైన్ అందుబాటులో ఉంది. మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల జిల్లాల మీదుగా ఈ లైన్ వెళ్తోంది. మొన్నటివరకు సింగిల్ లైన్‌గా, డీజిల్ లోకోమోటీవ్‌లు నడిచేలా ఉండగా.. దాన్ని మహబూబ్‌నగర్ వరకు డబుల్ లైన్ చేయడంతోపాటు ఎలక్ట్రిఫికేషన్ చేస్తున్నారు. ప్రస్తుతం ఆ పనులు ఇంకా కొనసాగుతున్నాయి. వనపర్తి జిల్లా మీదుగా రైల్వేలైన్ వెళ్తున్నప్పటికీ.. అది మదనాపూర్, ఆత్మకూరు మండలాలకే పరిమితంగా ఉంది. అక్కడ సాధారణ రైళ్లు మినహా అక్కడ ఎక్స్‌ప్రెస్‌లు ఆగే పరిస్థితి లేదు. పేరుకు వనపర్తి రోడ్ రైల్వేస్టేషన్‌గా నామకరణం చేసినప్పటికీ.. వనపర్తి జిల్లా కేంద్రానికి దాదాపు 20 కిలోమీటర్ల దూరంలో స్టేషన్ ఉంది. దాదాపు నాలుగు దశాబ్దాల నుంచి వనపర్తికి రైల్వేలైన్ సాధన కోసం ధర్నాలు, నిరసనలు చేపడుతున్నారు. మొదట రాయచూర్- మాచర్ల వరకు రైల్వేలైన్ వేయాలని ప్రతిపాదనలు చేశారు. 12 ఆగస్టు 2002 సంవత్సరంలో అప్పటి కేంద్రమంత్రి బండారు దత్తాత్రేయ చేతులమీదుగా రాయచూర్- గద్వాల వరకు రైల్వే లైన్‌కు శంకుస్థాపన చేశారు. ఆ లైన్ అందుబాటులోకి వచ్చి ఎలక్ట్రిఫికేషన్ కూడా పూర్తయ్యింది. ఆ తర్వాత ఉద్యమాలు జరిగినా గద్వాల నుంచి మాచర్ల వరకు రైల్వేలైన్‌కు ఆమోదం రాలేదు. గత సంవత్సరం అలైన్‌మెంట్ మార్చి- కొత్త లైన్‌కు ఫైనల్ లొకేషన్ సర్వేకు ఆదేశించగా అది పూర్తయ్యింది.

కొత్త అలైన్‌మెంట్ ఇదే..

రాయచూర్ నుంచి గద్వాల జంక్షన్ వరకు రైల్వేలైన్ పనులు పూర్తి కాగా.. ప్రస్తుతం రైళ్లు నడుస్తున్నాయి. గద్వాల నుంచి ఆరేపల్లి వరకు 7.8 కిలో మీటర్ల మేర ప్రస్తుతం లైన్ ఉంది. కొత్త అలైన్‌మెంట్ ప్రకారం అక్కడి నుంచి భత్యూరు, కడుకుంట్ల, వనపర్తి, గోపాల్‌పేట, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, నాంపల్లి, నల్గొండ, భీమవరం, సూర్యాపేట, మోతె, పాలేరు, కుసుమంచి మీదుగా డోర్నకల్ వరకు వెళ్తుంది. మొత్తం 296 కిలోమీటర్ల మేర రైలు మార్గం నిర్మించాల్సి వస్తుందని, ఇందుకు రూ.5,330 కోట్ల అంచనా వ్యయం అవుతుందని ప్రతిపాదించారు. దీనివల్ల పారిశ్రామికంగా అత్యంత వెనుకబాటులో ఉన్న వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాలు అభివృద్ధి అవుతాయి. నల్గొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాలకు రైలుమార్గం ఏర్పడి.. దూరభారం తగ్గడంతోపాటు దేశంలోని వివిధ ప్రాంతాలకు సులభంగా రైలులో ప్రయాణం చేసే అవకాశం లభిస్తుంది. పాత అలైన్‌మెంట్ ప్రకారమైతే.. ఆరేపల్లి నుంచి కడుకుంట్ల, వనపర్తి, గోపాల్‌పేట, సల్కార్‌పేట, నాగర్‌కర్నూల్, ఇంద్రకల్లు, తోటపల్లి, కల్వకుర్తి, వంగూరు, కందుకూరు, దేవరకొండ, మల్లేపల్లి, పెద్ద అడిశర్లపల్లి, చలకుర్తి, తిరుమలగిరి, నెల్లికల్, విజయపురి, కొత్తూరు మీదుగా కృష్ణానదిని దాటుకుని పాత గుంటూరు జిల్లా.. ప్రస్తుతం పాల్నాడు జిల్లా పరిధిలోని మాచర్లకు చేరుకోవాలి. ఆ ప్రాంతంలో సిమెంట్ ఫ్యాక్టరీలు ఎక్కువగా ఉండటంతో రవాణా సులభతరం అవుతుందని అంచనా వేశారు. కానీ కొత్త అలైన్‌మెంట్‌కు కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపడంతో ఉమ్మడి జిల్లాలో పాత అలైన్‌మెంట్‌లో ఉన్న కల్వకుర్తి వరకు రైలుమార్గం నిర్మాణం జరుగుతుంది. అక్కడి నుంచి వంగూరువైపు కాకుండా నాంపల్లి మీదుగా నల్గొండకు కొత్త అలైన్‌మెంట్ ఫైనల్ లొకేషన్ సర్వే పూర్తి చేశారు.

పాత అలైన్‌మెంట్ కోసమూ ప్రయత్నాలు..



ప్రస్తుతం ఆమోదం తెలిపిన అలైన్‌మెంట్‌లో కల్వకుర్తి వరకు రైలుమార్గం ఏర్పాటువుతుందని ప్రతిపాదించినప్పటికీ.. కీలకమైన నల్లమల ప్రాంతంతో పాటు సిమెంట్ ఫ్యాక్టరీలు అధికంగా ఉన్న ప్రాంతానికి రైలుమార్గం ఏర్పాటు కావడం లేదు. ఈ నేపథ్యంలో ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం కొత్త అలైన్‌మెంట్‌లో ఎలాగూ కల్వకుర్తి వరకు రైలుమార్గం ఏర్పాటు కానుండటంతో పాత అలైన్‌మెంట్ అంటే కల్వకుర్తి నుంచి వంగూరు మీదుగా మాచర్ల వరకు వెళ్లాల్సిన దూరాన్ని 126 కిలోమీటర్లుగా నిర్ణయించి.. ఆ మేరకు కనెక్టివిటీ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు చేస్తోంది. త్వరలో ఢిల్లీ వెళ్లనున్న సీఎం రేవంత్‌రెడ్డి పాత అలైన్‌మెంట్‌లో ఉండి, కొత్త అలైన్‌మెంట్ పరిధిలోకి రాని 126 కిలోమీటర్ల దూరానికి కూడా ఫైనల్ లొకేషన్ సర్వే పూర్తి చేసి నిధులు ఇవ్వాలని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్‌ను కోరనున్నట్లు తెలిసింది. ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేయడానికి దక్షిణ మధ్య రైల్వే అధికారులతో కొద్దిరోజుల క్రితం భేటీ అయ్యారు. గతంలో ఈ రైల్వేలైన్ పూర్తి చేయడానికి కావాల్సిన నిధుల్లో 50 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని అప్పటి సీఎం కేసీఆర్ ప్రకటన చేశారు. కానీ ఆ పనులు ముందుకు సాగలేదు. ప్రస్తుతం రైల్వేలైన్ నిర్మాణానికి కావాల్సిన రూ.5,330 కోట్ల ఖర్చును 100 శాతం కేంద్ర ప్రభుత్వమే భరించనుంది. గతంలో 51 శాతం కేంద్రం, 49 శాతం రాష్ట్రం భరించాలనే నిబంధన ఉన్నప్పటికీ.. ఇప్పుడా పరిస్థితి లేదు. ఒక్క భూసేకరణ మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం చేయించాల్సి ఉంటుంది. ఈ రెండు అలైన్‌మెంట్లకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రస్తుతం సానుకూలంగానే ఉండగా.. వచ్చే బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తారా? లేక ఇంకొన్నాళ్లు ఎదురుచూడాల్సి వస్తుందా? అనేది తేలాల్సి ఉంది. గద్వాల- మాచర్ల రైల్వేలైన్‌ను ప్రతిపాదించిన మొదట్లో పీపీపీ(పబ్లిక్ ప్రైవేటు పార్టిసిపేషన్) పద్ధతిలో సుమారు రూ.1,000 కోట్లు అవుతాయని అంచనా వేయగా.. ప్రస్తుతం అలైన్‌మెంట్ మార్పాక రూ.5,330 కోట్లకు వెళ్లింది. ఇంకా ఆలస్యం చేస్తే నిధుల ఖర్చు తడిసిమోపెడవుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



గద్వాల మండలం వీరాపురంలో రోడ్లపై పారుతున్న మురుగు నీరు



మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం నాయినోనిపల్లి గ్రామంలో మురుగు కాల్వను శుభ్రం చేస్తున్న కార్మికుడు

పారిశుధ్యంపై.. స్పెషల్ డ్రైవ్

- పల్లెల్లో నేటి నుంచి ఎనిమిది రోజుల పాటు నిర్వహణ
- ప్రత్యేక అధికారులకు ప్రభుత్వం తొలి టాస్క్
- తాగునీటి ఎద్దడి నివారణకు నిధులు మంజూరు

మహబూబ్‌నగర్/గద్వాల, ఫిబ్రవరి 6: గ్రామాల్లో సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో ప్రభుత్వ వారి స్థానంలో ప్రత్యేక అధికారులను నియమించింది. తమ పదవీకాలం ముగియడానికి ముందే సర్పంచ్‌లు గ్రామాల పర్యవేక్షణను వదిలేశారు. దీంతో చాలా గ్రామాల్లో పారిశుధ్య సమస్యలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఈ నెల ఏడో తేదీ గురువారం నుంచి 14 వరకు ఎనిమిది రోజుల పాటు పల్లెల్లో పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించింది. కలెక్టర్లు దీనిపై అధికారులకు ఇప్పటికే ఆదేశాలిచ్చారు. చేపట్టాల్సిన కార్యక్రమాలను వివరించారు.

చేపట్టాల్సిన పనులు ఇవీ..

గ్రామాల్లో రోజూ రహదారులను శుభ్రం చేయాలి. రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చాలి. మురుగు కాలువల్లో నీరు నిలవకుండా శుభ్రం చేయించాలి. చెత్తను, పిచ్చి మొక్కలను తొలగించాలి. పబ్లిక్ ప్రదేశాలైన స్కూల్, అంగన్‌వాడీ, హెల్త్ సెంటర్స్, మార్కెట్ ప్రాంతాలు, బస్‌స్టాప్‌లను శుభ్రంగా ఉంచుకోవాలి. ఖాళీ ప్లాట్లను శుభ్రం చేయించి, పాడుబడ్డ పాత భవనాలను తొలగించాలి. నీరు నిల్వకుండా చూడాలి. నీరు నిల్వ ఉన్నచోట వాటర్‌బాల్స్ దోమలు వృద్ధి చెందకుండా యాంటీ లార్వాలు వదలాలి. ఎప్పటికప్పుడు ఫాగింగ్ చేయాలి. తాగునీటిని ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయాలి. తాగునీటి పైప్‌లు లీకేజీ ఉంటే వెంటనే మరమ్మతులు చేపట్టాలి. ప్రతీ శుక్రవారం డ్రై డే నిర్వహించాలి.

15న గ్రామ సభలు

స్పెషల్ డ్రైవ్ పూర్తయిన తర్వాత ఈనెల 15న కలెక్టర్లు గ్రామ సభలు నిర్వహిస్తారు. ఈ సభలో సామాజిక రుగ్మతలు మద్యం తాగడం, గుట్కా, నార్కోటిక్స్‌పై యువతకు సందేశం ఇవ్వాలి. చాలా మంది యువత మద్యానికి, మత్తు పదార్థాలకు అలవాటు పడుతుండటంతో వాటి బారి నుంచి కాపాడేందుకు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని నిర్ణయించింది. ఈ కార్యక్రమంలో ప్రజల భాగస్వామ్యంతో అధికారులు విధిగా పాల్గొనాలని, లేదంటే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లోనే ఉండి కార్యక్రమాలను పర్యవేక్షించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

ఒక్కో నియోజకవర్గానికి రూ.కోటి

ఉమ్మడి జిల్లాలో 1,640 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇప్పటికే ప్రత్యేక అధికారులను నియమించారు. ప్రత్యేక పాలనలో గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం అధికారులపై మరిన్ని బాధ్యతలను పెట్టింది. వేసవి ప్రారంభం అవుతున్న నేపథ్యంలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా ఒక్కో నియోజకవర్గానికి రూ.కోటి కేటాయించింది.

నిధులు లేకుండా నిర్వహణ ఎలా?

గద్వాల: రాష్ట్ర ప్రభుత్వం బుధవారం నుంచి వారం పాటు గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించిన నేపథ్యంలో నిధులు లేకుండా పనులు ఎలా చేయాలని ప్రత్యేక అధికారులు పెదవి విరుస్తున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో 255 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇప్పటి వరకు సర్పంచులు సొంత నిధులు వెచ్చించి, కార్యక్రమాలను విజయవంతం చేశారు. వారి పాలన ముగిసి, గ్రామాలకు ప్రత్యేక అధికారులను నియమించిన విషయం తెలిసిందే. గ్రామ పంచాయతీ ఖాతాల్లో అక్కడక్కడ నిధులు ఉన్నా.. వాటిని డ్రా చేసే పరిస్థితి లేదు. ఖాతాలకు ప్రభుత్వం తాళం వేసింది. దీంతో కార్యక్రమాలను ఎలా నిర్వహించాలనే సందిగ్ధంలో ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

కనుల పండువగా రథోత్సవం

- తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్ నుంచి వేలాదిగా భక్తుల రాక
- మారుమోగిన అంజన్న నామస్మరణ



రథోత్సవంలో పాల్గొన్న వేలాది మంది భక్తులు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

ఊర్కొండ, ఫిబ్రవరి 6: నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం ఊర్కొండపేట గ్రామంలో వెలసిన అభయాంజనేయస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం తెల్లవారుజామున రథోత్సవం కనుల పండువగా సాగింది. ఈ కార్యక్రమానికి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతో పాటు, నల్లగొండ, రంగారెడ్డి, హైదరాబాద్, ప్రకాశం, గుంటూరు, కర్నూల్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలొచ్చారు. దాంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. ఈ సందర్భంగా జై శ్రీరాం, జై హనుమాన్ నినాదాలు మారుమోగాయి. పూజల అనంతరం స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని మేళతాళాల మధ్య తీసుకొచ్చి పూలతో అలంకరించిన రథంలో ఉంచారు. జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి రథోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కల్వకుర్తి డీఎస్పీ పార్థసారధి ఆధ్వర్యంలో ఊర్కొండ ఎస్ఐ లెనిన్, పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. వైద్య శాఖ హెల్త్ క్యాంపు నిర్వహించింది. ఆలయ సిబ్బంది, పాలక మండలి సభ్యులు భక్తులకు వసతులు కల్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు ఈశ్వరమ్మ, కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ద్యాప నిఖిల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు వెంకటయ్యగౌడ్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు తూడి అనిల్ రెడ్డి, ఆలయ కార్యనిర్వహణ అధికారి సత్యచంద్రారెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి పూజలు: బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణ రెడ్డి మంగళవారం స్వామి వారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ సిబ్బంది, పాలక మండలి సభ్యులు ఆయన్ను సన్మానించారు. ఆయన వెంట జడ్పీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీ సింగ్, నాయకులు బ్యూంగి ఆనంద్ కుమార్, మిర్యాల శ్రీనివాస్‌రెడ్డి, గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

- మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్ కూడా స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. పాలక మండలి సభ్యులు ఆయన్ను సన్మానించారు. ఆయన వెంట బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నిరంజన్‌గౌడ్. నాయకులు పెద్దయ్య యాదవ్, అరవింద్‌గౌడ్, శ్రీకాంత్‌యాదవ్, రాజేందర్‌గౌడ్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

- డివైడర్‌ను ఢీకొన్న ఖాళీ ట్రేలతో వెళ్తున్న డీసీఎం వ్యాను
- తర్వాత చేపల లోడుతో వెళుతున్న మరో వాహనానికి ఢీ
- అడ్డాకుల సమీపంలో ఘటన



అడ్డాకుల దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదం

అడ్డాకుల. ఫిబ్రవరి 6 : మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండల కేంద్రం సమీపంలోని స్నేహ చికెన్ ఫాం దగ్గర గల 44వ నెంబరు జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారుజామున ఓ వాహనం బోల్తాపడి మరో వాహనాన్ని ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం హైదరాబాద్ నుంచి కూరగాయాల ఖాళీ ట్రేలతో అనంతపూర్‌కు వెళుతున్న డీసీఎం వ్యాను అడ్డాకులకు సమీపంలోని స్నేహ చికెన్ ఫాం దగ్గర అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. సరిగ్గా అదే సమయంలో బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు చేపల లోడుతో వెళుతున్న డీసీఎం వ్యానును బలంగా ఢీకొన్నది. దీంతో కూరగాయల ట్రేలతో వెళుతున్న డీసీఎం డ్రైవర్ కడప జిల్లా చింతకొమ్మదిన్నె గ్రామానికి చెందిన సుధాకర్ (41) అక్కడికక్కడే మృతి చెందాడు. చేపల లోడ్‌తో వెళుతున్న డీసీఎం క్లీనర్ హైమద్ హుస్సేన్ (25)కు తీవ్రగాయాలు కాగా సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, ఎల్అండ్‌టీ సిబ్బంది మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ క్లీనర్ మృతి చెందాడు. అయితే రోడ్డుపై పడిపోయిన చేపలను, చేపల ట్రేలను స్థానికులు పట్టుకెళ్ళిపోయారు. రెండు డీసీఎంలలో ఎంత మంది ఉన్నారనేది సమాచారం లేదని, మృతుల బంధువులు వస్తేగాని పూర్తి వివరాలు తెలియవని ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

గృహహింస కేసులో ఆరేళ్ల జైలు శిక్ష

పీపనగండ్ల, ఫిబ్రవరి 6: గృహహింస కేసులో ఓ వ్యక్తికి మంగళవారం కోర్టు రూ.రెండు వేల జరిమానాతో పాటు, ఆరు సంవత్సరాల జైలుశిక్ష విధించినట్లు వనపర్తి ఎస్పీ రక్షిత కె.మూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీపనగండ్ల గ్రామానికి చెందిన దయపు శివ రోజూ తాగి వచ్చి భార్య శివమ్మను చిత్రహింసలకు గురి చేసేవాడు. భర్త వేధింపులు తాళలేక శివమ్మ 2019 సెప్టెంబరు 26న ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకొని ఆత్మహత్య చేసుకుంది. శివమ్మ మరణ వాంగ్మూలం మేరకు ఎస్ఐ వహీద్‌అలీబేగ్ కేసు నమోదు చేశారు. 306, 498-ఎ ఐపీసీ ప్రకారం చార్జిషీటును ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్ కోర్టులో వేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలయ్య కోర్టు కానిస్టేబుల్ రాజేందర్ 17 మంది సాక్షులను న్యాయాధికారి ముందు ప్రవేశపెట్టారు. భర్త శివపై నేరం రుజువు కావడంతో ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్ కోర్టు న్యాయాధికారి రజిత ఆరు సంవత్సరాల జైలుశిక్షతో పాటు, రూ.రెండు వేల జరిమానా విధించినట్లు ఎస్పీ వివరించారు.

కర్ణాటక మద్యం పట్టివేత



మద్యం, నిందితులతో పోలీసులు

గట్టు, ఫిబ్రవరి 6: జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు పోలీసులు మంగళవారం కర్ణాటక మద్యాన్ని పట్టుకొని, కేసు నమోదు చేశారు. గట్టు ఎస్ఐ రామకృష్ణ వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రంలోని ఎరిగేర, లింగన్‌ఖాన్‌దొడ్డి గ్రామాలకు చెందిన సుదర్శన్, రాజుగౌడ్, నరేష్‌గౌడ్ ఎరిగేరలో గల వందన బార్ అండ్ రెస్టారెంట్‌కు చెందిన వెంకటేష్ ఆదేశాలతో కర్ణాటక మద్యాన్ని ఆంధ్రకు కారులో తరలిస్తున్నారు. మంగళవారం తెల్లవారుజామున బల్గెర చెక్‌పోస్టు వద్ద పోలీసులు వాహనాన్ని ఆపి, తనిఖీ చేశారు. కారులో 20 కాటన్ల మద్యం లభించింది. వాటిని పరిశీలించగా.. అది కర్ణాటక లిక్కర్‌గా గుర్తించారు. కారును స్వాధీనం చేసుకొని మద్యాన్ని తరలిస్తున్న ముగ్గురిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మద్యం విలువ రూ.76,800 ఉంటుందని చెప్పారు. ముగ్గురితో పాటు, వెంకటేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మందుబాబులకు జైలుశిక్ష

అలంపూర్ చౌరస్తా, ఫిబ్రవరి 6 : జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ఐదుమంది మందుబాబులకు జైలుశిక్ష పడినట్లు అలంపూర్ ఎస్సై నాగరాజు తెలిపారు.

ఇటీవల బదిలీపై వెళ్లిన ఎస్సై రమేష్ ఆధ్వర్యంలో జరిగిన డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన షేక్ ఎక్బాల్‌కు రెండురోజులు, నాగరాజుకు మూడురోజులు, కావేటి జ్ఞానేంద్రుడుకు వారంరోజులు, కాలువల బాలకృష్ణకు మూడురోజులు, మద్దిలేటికి నాలుగురోజుల చొప్పున జైలుశిక్ష విధించడంతో పాటు, ఒక్కొక్కరికి రూ.రెండు వేల జరిమానా వేసినట్లు వివరించారు. మద్యం తాగి వాహనాలు నడపొద్దని, నిబంధనలు పాటించాలని ఈ సందర్భంగా ఎస్సై వాహనదారులను కోరారు.

ఉరి వేసుకొని వివాహిత ఆత్మహత్య



పర్వీన్‌సుల్తానా(ఫైల్)

మక్తల్, ఫిబ్రవరి 6 : ఉరి వేసుకొని వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై భాగ్యలక్ష్మిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఊట్కూర్ మండల కేంద్రానికి చెందిన పర్వీన్‌సుల్తానా(22)ను నర్వ మండలం పాతర్‌చెడ్‌కు చెందిన కలీంపాషతో రెండు సంవ త్సరాల క్రితం వివాహం జరిపించారు. కాగా వీరి కుటుంబం మక్తల్ పట్టణంలోని రహెమానియా కాలనీలో నివాసం ఉంటున్నారు. కలీంపాష నర్వలో టైలరింగ్ చేస్తూ ప్రతీనిత్యం మక్తల్ నుంచి నర్వకు వెళ్లి వస్తుంటాడు. మంగళవారం భర్త, కుటుంబ సభ్యులు ఎవరూ లేని సమయంలో పర్వీన్‌సుల్తానా ఇంట్లో ఉయ్యాల కొండికి ఉరి వేసుకుంది. కొద్దిసేపటి తర్వాత కుటుంబ సభ్యులు వచ్చి చూడగా అప్పటికే మృతి చెందింది. మృతురాలికి ఏడు నెలల కుమారుడు ఉన్నాడు. కాగా, తన కుమార్తెను అదనపు కట్నం కోసం భర్త, వారి కుటుంబ సభ్యులు వేధించారని మృతురాలి తల్లి జుబేదాబేగం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

కోస్గి రూరల్, ఫిబ్రవరి 6 : లారీ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన నారాయణపేట జిల్లా గుండుమాల్ మండల శివారులో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం జెక్కి తండాకు చెందిన బద్యానాయక్(50) గుండుమాల్ గ్రామ శివారులోని ఇటుకల బట్టీ వద్ద పనిచేస్తు ఇక్కడే జీవనం సాగిస్తున్నాడు. భక్తిమళ్లకు చెందిన అంజిలయ్యతో కలిసి బద్యానాయక్ మంగళవారం బైక్‌పై గుండుమాల్ వెళ్లి తిరిగి భక్తిమళ్ల వైపు వస్తుండగా గుండుమాల్ శివారులో మద్దూర్ వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. గమనించిన స్థానికులు కోస్గి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే బద్యానాయక్ మృతి చెందాడు. తీవ్ర గాయాల పాలైన అంజిలయ్యను మహబూబ్‌నగర్ ఆసుపత్రికి తరలించారు. బద్యానాయక్ భార్య దస్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

జడ్చర్ల, ఫిబ్రవరి 6 : రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన జడ్చర్ల రైల్వేస్టేషన్ పరిధి ఆలూరు రైల్వేగేటు సమీపంలో చోటు చేసుకుంది.

మహబూబ్‌నగర్ రైల్వే ఎస్సై సయ్యద్ అక్బర్ తెలిపిన వివరాల ప్రకారం.. జడ్చర్ల పట్టణంలోని ఆలూరుకు వెళ్లే దారిలోని కాలనీకి చెందిన ముస్లిం ఫకీర్ యూసుఫ్(34) మంగళవారం ఉదయం ఆలూరు రైల్వేగేటు సమీపంలో గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ కలహాల కారణంగా యూసుఫ్ ఆత్మహత్యకు పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో తెలిసిందన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై సయ్యద్ అక్బర్ తెలిపారు.

మరో ఘటనలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

జడ్చర్ల నుంచి హైదరాబాద్ వెళ్లే రైలు మార్గంలో జడ్చర్ల-గొల్లపల్లి మధ్య దారిలో గుర్తు తెలియని వ్యక్తి(45) రైలు కింద పడి మృతి చెందినట్లు మహబూబ్‌నగర్ రైల్వే ఎస్సై సయ్యద్‌అక్బర్ తెలిపారు. మృతుడి కుడి చేయి మోచేతి వరకు మాత్రమే ఉందని, రైలులో భిక్షాటన చేసుకుంటూ జీవనం సాగించే వ్యక్తిగా తెలిసిందని వివరించారు. మృత దేహాన్ని పోస్టుమార్టం కోసం జిల్లా జనరల్ ఆసుపత్రికి తరలించామని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు రైల్వే ఎస్సై తెలిపారు.

కూటమితో దేశానికి ఒరిగేదేమీ లేదు

- బీఆర్‌ఎస్‌కు ఓటు వేస్తే నోటాకు వేసినట్లే
- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు

కందనూలు, ఫిబ్రవరి 6 : ఇండియా కూటమితో దేశానికి ఒరిగేదేమీ లేదని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పార్టీ మధ్యప్రదేశ్ రాష్ట్ర ఇన్‌చార్జి మురళీధర్‌రావు అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇండియా కూటమితో దేశానికి ఒరిగేదేమీ లేదని విమర్శించారు. బీఆర్‌ఎస్ పార్టీ అవినీతి అక్రమాలకు పాల్పడిందని, ఆ పార్టీకి ఓటేస్తే నోటాకు వేసినట్లేనని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే బీఆర్‌ఎస్‌పై సమగ్ర విచారణ జరిపించి చర్యలు తీసుకుంటామన్న మాట నిలబెట్టుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. దేశంలో ప్రజలంతా మోదీ వైపు చూస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో అత్యధిక స్థానాలను కైవసం చేసుకుంటామని ఆయన పేర్కొన్నారు. బీజేపీ జాతీయ నాయకుడు తల్లోజు ఆచారి, జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు, నాగర్‌కర్నూల్ అసెంబ్లీ ఇన్‌చార్జి దిలీపాచారి, కట్ట సుధాకర్‌రెడ్డి, దొడ్ల రాజవర్ధన్‌రెడ్డి, దళిత సంఘం నాయకుడు మాన్య నాయక్, బీజేపీ పదాధికారులు, కన్వీనర్లు, ఆయా జిల్లాల అధ్యక్షులు పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మురళీధర్‌రావు

గౌడ కులస్తుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

- గౌడ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్, ఫిబ్రవరి 6 : గౌడ కులస్తుల సంక్షేమానికి సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలంగాణ ఆబ్కారీ, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ఎస్‌ఎం ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి గౌడ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గౌడ కులస్తులు మంత్రికి ఘన స్వాగతం పలికి, గజమాలతో సన్మానించారు. అనంతరం మంత్రి జూపల్లి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో గౌడ కులస్తులకు తీవ్ర అన్యాయం జరిగిందని, ఇచ్చిన హామీలను గత ప్రభుత్వం విస్మరించిందని, సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో కులవృత్తిని ఆధారంగా చేసుకుని ఉన్న గౌడ కులస్తులు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు తనవంతు తోడ్పాటునందిస్తానని భరోసా కల్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈత, తాటి వనాల పెంపకాన్ని ప్రోత్సహిస్తుందన్నారు. గీత కార్మికులకు సబ్సిడీలో పనిముట్లు, ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పెద్దకొత్తపల్లి ఎంపీపీ సూర్య ప్రతాప్‌గౌడ్, గౌడ సంఘం నాయకులు గోవిందు గౌడ్, రామన్‌గౌడ్, కౌన్సిలర్లు శ్రీదేవిగౌతంగౌడ్, మాజీ సర్పంచ్ హైమావతిగౌడ్, వంగ రాజశేఖర్ గౌడ్, కిరణ్‌తేజ, రామన్‌గౌడ్, సి.గోవిందుగౌడ్, రమేష్‌గౌడ్, వెంకటేశ్‌గౌడ్, యాదన్నగౌడ్, సుదర్శన్‌గౌడ్, మాచర్ల రామకృష్ణగౌడ్, వెంకటస్వామి గౌడ్, పెంట్లవెల్లి గ్రామ మాజీ సర్పంచ్ సువర్ణమ్మ, బాలస్వామిగౌడ్, దగడాల సుదర్శన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి జూపల్లి కృష్ణారావుకు పూలబోకే అందజేస్తున్న గౌడ సంఘం నేతలు

పేద విద్యార్థుల ఉన్నత చదువుల కోసం రూ.10 కోట్లు

కొల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.పది కోట్లు కేటాయించారని, ఆ డబ్బునంతా పేద విద్యార్థుల చదువుల కోసం వినియోగిస్తానని మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రకటించడంతో సభలో సర్వత్రా హర్షం వ్యక్తమైంది. తనను కలిసేందుకు వచ్చేవారు ఎవరైనా సరే పూలబోకేలు, శాలువాలు తీసుకురావద్దని దానికి ఖర్చయ్యే డబ్బును తాను ఏర్పాటుచేసిన విద్యానిధికి విరాళాలుగా ఇస్తే అందరం కలిసి నిరుపేద విద్యార్థులకు విద్యాదానం చేద్దామని, వారికి ఉజ్వల భవిష్యత్తును అందిద్దామని మంత్రి జూపల్లి పిలుపునిచ్చారు. విద్యాదానంపై మంత్రి జూపల్లి కృష్ణారావు అంకితభావం పట్ల నియోజకవర్గ ప్రజలు, కాంగ్రెస్ నాయకులు, ఉద్యోగులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అతిథి అధ్యాపకుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

నాగర్‌కర్నూల్ టౌన్, ఫిబ్రవరి 6 : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంగ్లిష్ సబ్జెక్టు బోధించుటకు అతిథి అధ్యాపకులు ఈనెల ఎనిమిదవ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ కమర్ షాజహాన్ సుల్తానా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు కనీసం 55 శాతం మార్కులతో ఎంఏ ఇంగ్లిష్ పూర్తి చేసి ఉండాలని, పీహెచ్‌డీ, నెట్, సెట్ పూర్తి చేసిన వారికి ప్రాధాన్యత ఉంటుందని ఆమె పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన వారు కళాశాల పనివేళల్లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు.

వాహనం బోల్తా

- నేల పాలైన రసాయన మందులు

భూత్పూర్, ఫిబ్రవరి 6 : అదుపు తప్పి వాహనం బోల్తా పడడంతో రూ.లక్షలు విలువ చేసే రసాయన మందులు నేల పాలయ్యాయి. ఈ సంఘటన మంగళవారం తెల్లవారుజామున మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ 44వ జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జోగుళాంబ గద్వాల జిల్లాకు చెందిన పదిమంది రైతులు తమ వ్యవసాయానికి సంబంధించిన క్రిమిసంహారక మందులను హైదరాబాద్ నుంచి కొనుగోలు చేసి గ్రామానికి తీసుకెళ్తున్నారు. మంగళవారం తెల్లవారుజామున వీరు ప్రయాణిస్తున్న వాహనం భూత్పూర్ వద్దకు రాగానే అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో రైతులకు స్వల్ప గాయాలు కాగా, రసాయన మందులు అన్నీ రోడ్డు పక్కన కాలువలో పడి మొత్తం నేల పాలయ్యాయి. వీటి విలువ సుమారు రూ.లక్షకు పైగా ఉంటుందని రైతులు తెలిపారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు.



భూత్పూర్ వద్ద వాహనం బోల్తా పడడంతో నేలపాలైన రసాయన మందులు

పంట పొలాల్లో నాగుపాము పట్టివేత

వనపర్తి రూరల్, ఫిబ్రవరి 6 : వనపర్తి జిల్లా పరిధిలోని చిట్యాల గ్రామ శివారులో మంగళవారం వరి పంట పొలాల్లో స్నేక్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు కృష్ణసాగర్ నాగుపామును బంధించారు. చిట్యాల శివారులోని శ్రీచైతన్య స్కూల్ సమీపాన ఉన్న ఎస్ఎస్ వాటర్ సర్వీసింగ్ సెంటర్‌లో ఉన్న మెకానిక్ షాపులో రఫీక్ మెకానిక్ పని చేసుకుంటు ఉండగా ఆకస్మాత్తుగా షాపులోకి పెద్ద నాగుపాము వచ్చింది. ఒక్కసారిగా తీవ్ర భయానికి గురైన రఫీక్ షాపులో ఉన్న సహచర మెకానిక్‌ల సహకారంతో బయటికి వచ్చారు. పాము మెల్లగా పక్కనే ఉన్న వరి మడిల్లోకి వెళ్లింది. సాగర్ స్నేక్ సొసైటీ అధ్యక్షుడు కృష్ణసాగర్‌కు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వగా పామున్న ప్రదేశానికి చేరుకుని వెంటనే చాకచక్యంగా నాగుపామును బంధించారు.



వరి పంట పొలంలో నాగుపామును బంధించిన కృష్ణసాగర్

నిజాయతీని చాటుకున్న వ్యక్తులు

- దొరికిన బంగారు ఆభరణాల బ్యాగ్ పోలీసులకు అప్పగింత
- వారి ద్వారా బాధితులకు అందజేత

మద్దూర్, ఫిబ్రవరి 6 : నారాయణపేట జిల్లా మద్దూర్ మండలంలోని దోరేపల్లికి చెందిన ఇద్దరు వ్యక్తులు నిజాయతీని చాటుకున్నారు. ఏఎస్పీ శ్యాంసుందర్ తెలిపిన వివరాల ప్రకారం.. కోస్గి పట్టణానికి చెందిన షాహీన్‌బేగం భర్త ఇబ్రహీంతో కలిసి కోస్గి నుంచి ద్విచక్ర వాహనంపై పుట్టినిల్లయిన దామరగిద్ద మండలం గడిమున్కన్‌పల్లికి వెళ్తున్న క్రమంలో మద్దూర్ మండల పరిధిలోని దోరేపల్లి వద్ద ద్విచక్ర వాహనానికి కట్టిన బ్యాగ్ పడిపోయింది. ఆ మార్గంలో వెళ్తున్న దోరేపల్లికి చెందిన చోటెమియా, సుతారి శివరాజ్‌కు దొరికింది. బ్యాగ్‌ను వారు మద్దూర్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. బ్యాగులో ఎనిమిది తులాల విలువైన బంగారు ఆభరణాలు, రూ.500 నగదు, ఆధార్‌కార్డు ఉంది. ఆధార్‌కార్డు ఆధారంగా బాధితులను గుర్తించి వారికప్పగించినట్లు ఏఎస్పీ వివరించారు. నిజాయతీని చాటుకున్న చోటేమియా, శివరాజ్‌లను పోలీసులు అభినందించారు.



బంగారు ఆభరణాల బ్యాగ్‌ను పోలీసులకు అప్పగిస్తున్న వ్యక్తులు

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

గద్వాల టౌన్, ఫిబ్రవరి 6 : విధి నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్ర సమీపంలోని ఏడవ వార్డు పరిధి దౌదర్‌పల్లి ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు వేణుగోపాల్‌రెడ్డిని సోమవారం రాత్రి డీఈవో సస్పెండ్ చేసినట్లు మంగళవారం తెలిసింది. కొన్నాళ్ల క్రితం రోడ్డు ప్రమాదానికి గురై దీర్ఘకాల సెలవులో ఉన్న వేణుగోపాల్‌రెడ్డి తిరిగి ఇటీవలే విధుల్లో చేరారు. విధుల్లో కొనసాగుతున్నప్పటికీ తరచుగా పాఠశాలకు గైర్హాజరవుతున్నట్లు స్థానికులు ఫిర్యాదు చేశారు. స్పందించిన జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) అపూర్వచౌహాన్ సోమవారం మధ్యాహ్నం పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయ హాజరు రిజిస్టర్‌లో సంతకం ఉన్నప్పటికీ పాఠశాలలో ఉపాధ్యాయుడు లేకపోవడాన్ని గుర్తించిన అదనపు కలెక్టర్ నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని డీఈవోను ఆదేశించారు. దీంతో ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తూ డీఈవో సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

రైలు ప్రయాణికులపై దాడి

- రైలు దిగి వస్తున్న వారి నుంచి సెల్‌ఫోన్, నగదు చోరీ చేస్తున్న యువకులు

గద్వాల క్రైం, ఫిబ్రవరి 6 : కొందరు యువకులు రైలు ఎక్కడానికి వస్తున్న ప్రయాణికులను టార్గెట్ చేస్తూ వారిని దోపిడీ చేయడం, అడ్డువచ్చిన ప్రయాణికులను దాడి చేసి గాయపరుస్తున్న సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకొంది. ఇందుకు సంబంధించి ప్రయాణికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గద్వాల పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న ముళ్లపొదల సమీపంలో కొందరు యువకులు వాహనాలతో వచ్చి అక్కడే నిలబడుతున్నారు. మంగళవారం అర్ధరాత్రి రైలు దిగి ప్రయాణికులు నడుచుకుంటు వెళ్తుండగా కొందరు యువకులు అమాంతం వారిపై దాడి చేసి వారి నుంచి సెల్‌ఫోన్‌లు, నగదును చోరీ చేసి తాము తెచ్చుకున్న బైక్‌లపై ఉడాయించారు. అలాగే, మంగళవారం తెల్లవారుజామున వెంకటాద్రి రైలుకు వస్తున్న ప్రయాణికులను ముళ్లపొదల సమీపంలో చీకటిగా ఉన్న ప్రాంతంలో మాటు వేసి ప్రయాణికులపై ఒక్కసారిగా పడి వారి నుంచి సెల్‌ఫోన్‌లు, నగదును లాక్కున్నారు. ఇదే క్రమంలో ఓ ప్రయాణికుడు డబ్బులు ఇవ్వకుండా రాయితో దాడి చేసి గాయపర్చగా పక్కన ఉన్న మిగితా ప్రయాణికులు చోరీ చేసేందుకు వచ్చిన వారిపై రాళ్లను విసిరారు. దీంతో దుండగులు పరారయ్యారని ప్రయాణికులు 'ఆంధ్రజ్యోతి'తో తెలిపారు. కొందరు ప్రయాణికులు రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు యువకుల కోసం గాలిస్తున్నారు.

రెండు ఇసుక టిప్పర్ల పట్టివేత

నాగర్‌కర్నూల్ క్రైం, ఫిబ్రవరి 6 : అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు టిప్పర్లను పట్టుకుని సీజ్ చేసినట్లు నాగర్‌కర్నూల్ ఎస్సై గోవర్ధన్ మంగళవారం తెలిపారు. తమకందిన సమాచారం మేరకు కొల్లాపూర్ చౌరస్తాలో అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న టిప్పర్లను పట్టుకొని స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు.

ఇసుకను తరలిస్తున్న వారిపై కేసు నమోదు

గండీడ్, ఫిబ్రవరి 6 : అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం రంగారెడ్డిపల్లి, కప్లాపూర్ గ్రామ శివారులో మంగళవారం ఉదయం ఎలాంటి అనుమతులు లేకుండా ట్రాక్టర్లల్లో ఇసుకను తరలిస్తుండగా బీట్ డ్యూటీ కానిస్టేబుల్ పట్టుకొని వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ల యాజమానులు రంగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన మాటూరి మల్లయ్య, కప్లాపూర్ గ్రామానికి చెందిన తిరుపతిరెడ్డిలపై, డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఉపాధ్యాయుల కొరత తీర్చాలని ఎమ్మెల్యేకు వినతి



ఉపాధ్యాయుల కోసం ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న అభివృద్ధి కమిటీ సభ్యులు

తిమ్మాజిపేట, ఫిబ్రవరి 6 : తిమ్మాజిపేట మండల పరిధిలోని బావాజీపల్లి పాఠశాలలో నెలకొన్న ఉపాధ్యాయుల కొరత వెంటనే తీర్చాలని కోరుతూ పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు మంగళవారం నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డిని క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాతల సహకారంతో పాఠశాలను పునర్నిర్మాణం చేసుకోవడం జరిగిందని విద్యార్థులకు అన్ని వసతులు కల్పించామన్నారు. ఈ పాఠశాలలో ఏడవ తరగతి వరకు ఉన్నా ఇద్దరే ఉపాధ్యాయులు పని చేస్తుండడంతో మా లక్ష్యం నీరుగారిపోయిందన్నారు. మన ఊరు మన బడిలో భాగంగా మా ఊరికి నూతన పాఠశాల భవనాన్ని మంజూరు చేయించి నిర్మింపజేయాలని వారు ఎమ్మెల్యేను కోరారు. ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి స్పందిస్తూ గ్రామంలో విరాళాలు సేకరిస్తూ పలు కార్యక్రమాలు చేపడుతూ అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్న కమిటీ సభ్యులను అభినందిస్తూ ఉపాధ్యాయుల ఏర్పాటు విషయమై జిల్లా విద్యాశాఖ అధికారితో ఫోన్‌లో మాట్లాడారు. ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేసిన వారిలో కమిటీ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, కోశాధికారి సుధాకర్‌గౌడ్, సభ్యులు హనుమంతురెడ్డి, జహంగీర్, నిరంజన్, బాలరాజు, రామకృష్ణగౌడ్ తదితరులు ఉన్నారు.

'జీపీ కార్మికుల సమస్యలపై పోరాటం ఉధృతం'

కందనూలు, ఫిబ్రవరి 6: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధంగా రూపొందించిన క్యాలెండర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలపై, వారి వేతనాల పెంపుపై పోరాటం ఉధృతం చేస్తామన్నారు. వేతనాలు 26వేలు ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికులతో వెట్టిచాకిరీ చేయించుకుంటూ వారికి ఏమాత్రం గుర్తింపునివ్వడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.శివశంకర్, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ఆనంద్‌జీ, తెలంగాణ గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ అనుబంధ ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు పెరుమల్ల శంకరయ్య ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాసులు, ఎం.శ్రీనివాసులు, చిన్నపాగ శ్రీనివాసులు, బాలపీరు ఉన్నారు.

సింగోటం ఆలయం హుండీ లెక్కింపు



సింగోటం లక్ష్మీనరసింహస్వామి ఆలయ హుండీ లెక్కింపు దృశ్యం

కొల్లాపూర్, ఫిబ్రవరి 6: కొల్లాపూర్ మండల పరిధిలోని సింగోటం లక్ష్మీనరసింహస్వామి ఆలయం హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. హుండీ లెక్కింపు కార్యక్రమానికి ఆలయ ధర్మకర్త సురభి బాలాదిత్య లక్ష్మణ్‌రావు, ఈవో రంగారావుల సమక్షంలో నిర్వహించిన హుండీ లెక్కింపులో 16 లక్షల 64వేల 225రూపాయలుతో పాటు వెండి 3కేజీల 990గ్రాములు ఉన్నట్లు ఈవో రంగారావు పేర్కొన్నారు. హుండీ లెక్కింపు కార్యాక్రమం మంగళవారం ఉదయం ప్రారంభమై సాయంత్రం వరకు కొనసాగింది. సింగోటం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు గత నెల 15 నుంచి ప్రారంభమైన విషయం తెలిసిందే. మరో వారం రోజుల పాటు లక్ష్మీనరసింహస్వామి జాతర కొనసాగనుంది.

సమష్టి కృషితోనే అభివృద్ధి సాధ్యం



సత్కారం పొందిన దేవునితిర్మలాపూర్ పంచాయతీ పాలక వర్గ సభ్యులు

పెద్దకొత్తపల్లి, ఫిబ్రవరి 6 : గ్రామాలు ప్రజాప్రతినిధులు, అధికారుల సమిష్టి కృషితోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని దేవునితిర్మలాపూర్ గ్రామంలో సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ హాజరై మాట్లాడారు. దేవునితిర్మలాపూర్ సర్పంచ్ వి.సత్యం, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు మిద్దె చంద్రయ్య, సర్పంచ్ వి.సత్యం, ఉపసర్పంచ్ వి.శ్రీనివాసులు, నాయకులు పుట్ట ఆంజనేయులు, పిల్లి వెంకటేష్, నరేందర్‌గౌడ్, సుధాకర్, వార్డు సభ్యులు బొల్లె విష్ణు, బాలస్వామి, బక్కయ్య, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా రేషన్ సరకులు అందజేయాలి

చౌకధర దుకాణంలో నెలసరి లబ్ధిదారులకు సరు కులు సక్రమంగా అందజేయాలని ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ అన్నారు. మంగళ వారం మండల పరిధిలోని కల్వకోల్ గ్రామంలో రేషన్‌షాపును పాత స్థలం నుం చి కొత్తగేరీలో ప్రారంభోత్సవం చేశారు. ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మీదేవి, ఉప సర్పంచ్ పుట్టరాముడు, మాజీ సర్పంచ్ ఈదన్న, మాజీ ఉప సర్పంచ్ వెంకటస్వామి, కాంగ్రెస్ నాయకులు మదన్‌మోహన్, శివగౌడ్, బచ్చన్నగౌడ్, ఎండి.వలీ, కుర్మయ్య, మద్దిలేటి, శంకరయ్య, కడ్తాల రాంబాబు, కుమార్, మహేష్ పాల్గొన్నారు.

పూలే విగ్రహ ప్రతిష్ఠకు భూమి పూజ



పూలే విగ్రహ ప్రతిష్ఠకు భూమి పూజ చేస్తున్న దృశ్యం

కోడేరు, ఫిబ్రవరి 6 : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ పస్పుల వెళ్లే ప్రధాన రహదారి కూడలిలో మండల వ్యవసాయ ఆఫీస్ దగ్గర మహాత్మాజ్యోతిరావు పూలే, ఆయన సతీమణి సావిత్రిబాయి పూలే విగ్రహాల ప్రతిష్ఠకు మండల మాజీ ఎంపీపీ కొత్త రామ్మోహన్‌రావు మంగళవారం భూమి పూజ చేశారు. విగ్రహ దాతలుగా ముందుకు వచ్చిన దూరెడ్డి సురేందర్‌రెడ్డి, పుట్టరామును రామ్మోహన్‌రావు అభినందించి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ మాట్లాడుతూ సమాజం కోసం అహర్నిషలు శ్రమించి ఉన్నత ఆశయాన్ని ఎన్నుకుని ఆశయం కోసం అష్టకష్టాలు పడి సమాజ సేవ చేసిన నాయకులను గుర్తుంచుకోవాలన్నారు. వారి విగ్రహాలు ఏర్పాటు చేసుకుని వారి ఆశయం, ఆలోచనలను ముందుకు తీసుకెళ్లాలన్నారు. ముందుగా జ్యోతిరావుపూలే, సావిత్రిబాయి పూలే చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి విగ్రహాల ప్రతిష్ఠ కోసం కొబ్బరికాయలు కొట్టి భూమి పూజ చేశారు. మండల కో అప్షన్ మెంబరు ఎస్‌కే.అబ్దుల్‌కరీం, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మిద్దె శాంతయ్య, మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ వీరపాగ కిరణ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు ఆదిరాజు, ఆదిశరత్, సురేష్, వీరస్వామి పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్ సీఐ బదిలీ



సీఐగా బాధ్యతలు స్వీకరించిన కనకయ్య

నాగర్‌కర్నూల్ క్రైం, ఫిబ్రవరి 6: నాగర్‌కర్నూల్ సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి బదిలీపై మంగళవారం వెల్దండ వెళ్లారు. నాగర్‌కర్నూల్ సీఐగా కనకయ్య రానున్నారు. మల్టీజోన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న కనకయ్య జోగులాంబ గద్వాల జోన్‌కు బదిలీ అయ్యారు. దీంతో నాగర్‌కర్నూల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఉత్తర్వులను జారీ చేశారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- ఎమ్మెల్యే వంశీకృష్ణ



ప్రత్యేక అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

అచ్చంపేట, ఫిబ్రవరి 6: అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామాల్లో వేసవిలో మంచినీటి ఎద్దడి లేకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. మంగళవారం ఆయన అంబేడ్కర్ ప్రజా భవనంలో అధికారులతో సమీక్షాసమావేశం నిర్వహించారు. ప్రత్యేకదికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వచ్చేవేసవిని దృష్టిలో పెట్టుకొని మంచినీటి సమస్యను అధిగమించాలని ఆయన సూచించారు. ఎవరికి కేటాయించిన గ్రామాల్లో వారు పర్యటిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకొంటూ సమస్యలు పరిష్కారం అయ్యేలా ప్రతీ ప్రత్యేక అధికారి చొరవ చూపాలన్నారు. ప్రత్యేక అధికారులు గ్రామాలకు వెళ్లకుండా నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఏదైన సమస్య జటిలంగా ఉంటే నా దృష్టికి తీసుకరావాలన్నారు. గ్రామాల్లో డ్రైనేజీ, మంచినీటి సమస్యలేకుండా అధికారులు పనిచేయాలన్నారు. మండల డివిజన్ అధికారులు గ్రామాలను పర్యటిస్తూ గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారులను ప్రజలను సమన్వయ పరుస్తూ సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత మండల, డివిజన్ అ ధికారులపై ఉందన్నారు. ప్రజా పాలనలో ప్రతీ అధికారి భాగ్యస్వాములై ప్రజలకు చేరువయ్యే పాలన అందించాలని ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఆర్డీవో గోపిరామ్, డీఎల్‌పీవో వెంకటయ్య, డీఈ హేమలత, జడ్పీటీసీ మంత్రియా నాయక్, ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి

- ఫుడ్‌ఫెస్టివల్ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి



విద్యార్థులు చేసిన వంటకాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి

కందనూలు, ఫిబ్రవరి 6: విద్యాభివృద్ధికి కృషి చేస్తానని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమానికి ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన వంటకాలను, వాటిని ఖరీదులను తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తన తండ్రి అడుగుజాడల్లోనే తాను నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిషలు కృషి చేస్తానన్నారు. విద్యాభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. విద్యార్థినులు తయారు చేసిన వివిధ రకాల వంటకాలను పరిశీలించి వారిలో ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి ఈ ఫుడ్ ఫెస్టివల్ దోహదపడుతుందన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రహరీ గోడ నిర్మాణం కోసం జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి చర్యలు చేపడుతానన్నారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపక బృందం ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి శాలువాతో సన్మానించారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దొడ్ల ఈశ్వర్‌రెడ్డి, మునిసిపల్ కౌన్సిలర్లు జక్కా రాజ్‌కుమార్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్‌తోపాటు అధ్యాపక బృందం తదితరులు ఉన్నారు.

అనుచిత వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి



చారకొండలో బాల్కసుమన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చారకొండ, ఫిబ్రవరి 6: రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్ అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకొని సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జమ్మికింది బాల్‌రాంగౌడ్ అన్నారు. అచ్చంపేట ఎమ్మెల్యే డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పిలుపు మేరకు మంగళవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలోని జడ్చర్ల-కోదాడ ప్రధాన రహదారిపై కాంగ్రెస్ నాయకులు బాల్కసుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో బాల్కసుమన్‌పై ఫిర్యాదు చేశారు. మండల యూత్ అధ్యక్షుడు గణేష్‌గౌడ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌లు పానుగంటి అంజయ్య, అనిశెట్టి నాగేంద్ర, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు గొరెటి శివ, పీఏసీఎస్ డైరక్టర్ జగన్‌మోహన్, మండల మైనార్టీ అధ్యక్షుడు సత్తార్, గ్రామ కమిటీ అధ్యక్షుడు లక్ష్మయ్యగౌడ్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు అంజయ్య, ఏసారపు ఆశోక్‌గౌడ్, జేసీబీ వెంకటయ్యగౌడ్, గుండె శివగౌడ్, కందికంటి శ్రీను, పసుల వెంకట్‌రెడ్డి, నర్సింహరెడ్డి, విజయ్, కుకుడాల శ్రీనివాసులు, సహదేవ్, తిరుమలేష్, పర్వతాలు, ప్రసాద్, నర్సింహచారి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

● ఉప్పునుంతల: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్ అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఉప్పునుంతలలోని పోషమ్మ చౌరస్తాలలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బాల్కసుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు కట్టా అనంతరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో నువ్వు చేసిన ఆరాచకాలు గత 10 సంవత్సరాల పాలనలో అవినీతి మొత్తం బయట పెట్టి బాల్కసుమన్ జైల్లో ఊచలు లెక్కబెట్టక తప్పదని ఆయన హెచ్చరించారు. నాయకులు నర్సింహరెడ్డి, రేణయ్య, కృష్ణ, శేఖర్‌గౌడ్, రామచంద్రయ్య, శ్రీను, భాస్కర్, సురేష్ తదితరులు ఉన్నారు.

● పెంట్లవెల్లి: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని అసభ్య పదజాలంతో దూషించిన చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్‌పై కేసు నమోదు చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నరసింహయాదవ్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ రామన్‌గౌడ్‌కు ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నరసింహయాదవ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి హబీబ్, కాంగ్రెస్ నాయకులు బాలరాజు, నరసింహ, నరేష్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

● అచ్చంపేటటౌన్: ఖబడ్దార్ బాల్క సుమన్ నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడలేకపోతే నువ్వు ఎక్కడా తిరగవన్వివమని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాజేందర్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్ అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఆయన దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటు ద్వారా ప్రజలు బుద్ధి చెప్పినా ఇంకా మీలో మార్పు రాలేదని మా కార్యకర్తలు నాయకులు తల్చుకుంటే రోడ్లపై తిరగనివ్వమని హెచ్చరించారు. మీ నాయకుల మెప్పు కోసం ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడితే చూస్తూ ఊరుకోమని 12 గంటల్లోగా ముఖ్యమంత్రికి బహిరంగంగా క్షేమాపణలు చెప్పాలని, లేకుంటే 100 చెప్పులతో నీకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సమాధానం చెబుతారన్నారు. నాయకులు గౌరీశంకర్, రఘు, నాయకులు పాల్గొన్నారు.

ఓటమిని జీర్ణించుకోలేకపోతున్నారు...

బీఆర్ఎస్ నాయకులు ఓటమిని జీర్ణించుకోలేక పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నారని నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మోపతయ్య అన్నారు. ముఖ్యమంత్రిపై మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అనుచిత వ్యాఖ్యలు తక్షణమే ఉపసంహరించుకొని క్షమాపణలు చెప్పాలన్నారు.

● వంగూరు: బీఆర్ఎస్ నేత బాల్కసుమన్ స్థాయిని మరచి సీఎం రేవంత్‌రెడ్డిపై చేసిన ఆరోపణలను నిరసిస్తూ మంగళవారం వంగూరులో కాంగ్రెస్ శ్రేణులు దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు పండిత్‌రావు మాట్లాడారు. మాజీ సర్పంచ్ పాండురంగారెడ్డి, మల్లయ్యయాదవ్, జనార్దన్, కృష్ణయ్య, వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

● కందనూలు: బాల్కసుమన్ నోరు అదుపులో పెట్టుకో, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జోలికొస్తే సహించేది లేదని టీపీసీసీ డాక్టర్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మాణిక్యాల చెన్నయ్య మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. బీఆర్ఎస్ మాజీ శాసన సభ్యుడు బాల్కసుమన్ మతిస్థిమితం కోల్పోయి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఎంత వరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. తక్షణమే బాల్కసుమన్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు తెలంగాణ ప్రజలకుబహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

● అమ్రాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసి దూషించిన చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సమన్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అమ్రాబాద్ మండల కేంద్రంలో మంగళవారం దహనం చేశారు. అనంతరం అమ్రాబాద్ పోలీస్ స్టేషన్‌లో బాల్క సుమన్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేశారు. చేసిన వారిలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హరి నారాయణ గౌడ్, డీసీసీ కార్యదర్శి రేణయ్య, నాయకులు రఘురాం, కృష్ణయ్య అంబ నారాయణ, తిరుమలయ్య మక్బుల్, ఆదినారాయణ, ఆనంద్ ఉన్నారు.

● బల్మూర్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధిక సీట్లతో గెలుపొంది సాఫీగా ప్రజల సమస్యలను పరిష్కారం కోసం రేవంత్‌రెడ్డి పని చేస్తుంటే పదవి పోయి పిచ్చివాడిలా ప్రవర్తిస్తున్న బాల్కసుమన్ కాంగ్రెస్ పార్టీ నుంచి గట్టి బుద్ధి చెప్తామని మండల పార్టీ అధ్యక్షుడు వెంకటరెడ్డి అన్నారు.

మంగళవారం మండల కేంద్రంలో ని అంబేడ్కర్ చౌరస్తాలో బాల్కసుమన్ దిష్టిబొమ్మను చెప్పులతో కొట్టి అనంతరం దహనం చేశారు. మాజీ ఎంపీటీసీ ఖదీర్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటయ్య, మాజీ సర్పంచ్‌లు శ్రీనివాసులు, కృష్ణయ్య భగవాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● కల్వకుర్తి: సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బాల్కసుమన్ దిష్టిబొమ్మను కల్వకుర్తి పట్టణంలో దహనం చేశారు. యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బాల్కసుమన్ దిష్టిబొమ్మను దహనం చేసి ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అనిల్‌గౌడ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి మిరియాల శ్రీనివాస్‌రెడ్డి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు షాకీర్, నాయకులు నానియాదవ్, చిన్నా, అన్వర్‌పాష తదితరులు ఉన్నారు.



ఉప్పునుంతలలో బాల్కసుమన్ దిష్టిబొమ్మను దహనం చేసిన కాంగ్రెస్ నాయకులు

విద్యాభివృద్ధికి పెద్దపీట

- కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి



ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న బీసీ బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు

కల్వకుర్తి, ఫిబ్రవరి 6 : విద్యాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. కల్వకుర్తి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీసీ బాలుర గురుకుల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు గురుకులంలో కావాల్సిన వసతుల గురించి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డికి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు, మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ షానవాజ్‌ఖాన్, నాయకులు జిల్లెల రాములు, చిన్నారాంరెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



తుమ్మలసూగురులో స్వయం పరిపాలన దినోత్సవంలో విద్యార్థులు

తాడూరు, ఫిబ్రవరి 6 : మండలంలోని తుమ్మలసూగురు ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా డీఈవోగా యుగేందర్‌తోపాటు పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రమోద్ కుమార్, ఉపాధ్యాయులు సుఖజీవన్‌రెడ్డి, రాజేందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ విధానాలను ప్రతిఘటిద్దాం



నిరసన వ్యక్తం చేస్తున్న కేవీపీఎస్ నాయకులు, అడ్డా కూలీలు

నాగర్‌కర్నూల్ టౌన్, ఫిబ్రవరి 6: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ కార్పొరేట్, మతోన్మాద విధానాలను ప్రతిఘటిద్దామని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సంతబజారులో అడ్డా కూలీలతో కలిసి కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై కేవీపీఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాశన్న మాట్లాడుతూ 10 ఏళ్ల బీజేపీ పాలనలో ఆదానీకి ఆస్తులు పెరిగాయే తప్పా అన్నదాతల కష్టాలు తీరలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలపై ఫిబ్రవరి 16న దేశ వ్యాప్తంగా సార్వత్రిక సమ్మెకు కేవీపీఎస్ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని పేర్కొన్నారు. సమ్మెలో అడ్డ కూలీలు, కార్మికులు, కర్షకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కేవీపీఎస్ నాయకులు మధు, సుధాకర్, రాముడు, యాదయ్య, వెంకటయ్య, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

చెంచుల జీవనోపాధిపై అవగాహన సదస్సు

బల్మూరు, ఫిబ్రవరి 6 : ప్రధానమంత్రి జన్‌మన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం కొండనాగుల గ్రామంలో జీవనోపాధులకు చెంచు మహిళలకు వన్‌ధన్ కేంద్రం మెంబర్స్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఎం లక్ష్మయ్య మాట్లాడుతూ చెంచు మహిళలు ఆర్థికంగా ఎదగాలంటే అక్షరంతోపాటు పొదుపును పాటించి కుటుంబంలో అందరూ పని చేసే విధంగా కృషి చేస్తేనే చెంచు కుటుంబాలు ఆర్థికంగా ఎదుగుదలకు వస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. డీపీఎం చెంచు లక్ష్మయ్య, ఎంజీఎస్‌ఆర్‌ఈజీఎస్ ఈసీ స్వామి, ఎన్‌జీవో నుంచి శ్రీనివాసులు, చెంచు సమైక్య అధ్యక్షురాలు సైదమ్మ, సీసీ రోజు, ఎంఎస్‌ఏ మల్లేశ్వరి, వీవోఏలు పాల్గొన్నారు.

బిహార్ రాష్ట్ర ఎమ్మెల్యేకు వంశీకృష్ణ ప్రథమ చికిత్స



సంజయ్ తివారీ చేతికి చికిత్స నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

మన్ననూర్, ఫిబ్రవరి 6: బిహార్ కాంగ్రెస్ ఎమ్మెల్యేల బృందం విహార యాత్రలో భాగంగా నల్లమల పర్యటనకు వచ్చారు. మన్ననూరు పర్యాటక వనమాలికలో ఎమ్మెల్యేల్లో సంజయ్‌కుమార్ తివారీ చేతికి గాయమైంది. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ వనమాలిక కాటేజీలోనే సంజయ్ తివారీ చేతికి డ్రస్సింగ్ చేశారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

ఉప్పునుంతల, ఫిబ్రవరి 6: మండల కేంద్రమైన ఉప్పునుంతలలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం వివిధ గ్రామాల్లోని లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను ఆర్ఐ రాజేశ్వర్‌రెడ్డి అందచేశారు. మండల పార్టీ అధ్యక్షుడు కట్టా అనంతరెడ్డి, నాయకులు రేణయ్య, కృష్ణ, శేఖర్‌గౌడ్, శేఖర్‌యాదవ్, నందనచారి, మధురెడ్డి, జూనియర్ అసిసెంట్ అబ్రహం తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు సులభతర అధ్యయన విద్యను అందించాలి

ఉప్పునుంతల, ఫిబ్రవరి 6:మండల ప్రాథమిక పాఠశాలల వెల్టూరు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని మంగళవారం మండల పరిధిలోని పెనిమిళ్ల మోడల్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల మేధస్సును అంచనా వేసుకొని వారికి అర్థమయ్యేలా విద్యాబోధన చేయాలని పలువురు ఉపాధ్యాయులు ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. హెచ్‌ఎం రవిశేఖర్, సెక్రటరీ రామస్వామి, సీఆర్‌పీ శ్రీను తదితరులు ఉన్నారు.

ఎస్ఐని సన్మానించిన యూత్ కాంగ్రెస్ మండల నాయకులు

చారకొండ, ఫిబ్రవరి 6: చారకొండ ఎస్ఐగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ ఎస్.రాజశేఖర్‌ను మంగళవారం మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గణేష్ ఆధ్వర్యంలో మండల యూత్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి బొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. గుండె శివగౌడ్, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు గొరెటి శివ, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ అనిశెట్టి నాగేంద్ర, మండల సోషల్ మీడియా అధ్యక్షుడు శివ, మండల యూత్ నాయకులు మహేష్‌గౌడ్, విజయ్, తిరుమలేష్, నాగేష్‌గౌడ్, శ్రీనునాయక్, రమణ తదితరులు పాల్గొన్నారు.

● తాడూరు: మండల కేంద్రానికి నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ మహేష్‌ను మండలంలోని చెర్లతిర్మలాపూర్ గ్రామస్థులు మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి పూలమాలలు వేసి అభినందనలు తెలిపారు. అభినందించిన వారిలో గ్రామ మాజీ సర్పంచ్ వెంకటస్వామితోపాటు గ్రామస్థులు ఉన్నారు.

పారిశుధ్య కార్మికుల సేవలు మరువలేనివి



తాండ్రలో పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న కాయితీ ఆశాదీప్‌రెడ్డి

కల్వకుర్తి, ఫిబ్రవరి 6 : పారిశుధ్య కార్మికుల సేవలు మరువలేనివని యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కాయితీ ఆశాదీప్‌రెడ్డి అన్నారు. కల్వకుర్తి మండలం తాండ్ర గ్రామంలో గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులకు మంగళవారం ఆయన దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలు పరిశుభ్రంగా ఉన్నాయంటే అందుకు పారిశుధ్య కార్మికుల శ్రమ ఇమిడి ఉందని పేర్కొన్నారు. తాండ్రా గ్రామ నాయకులు తదితరులు ఉన్నారు.

మట్టిరోడ్డు పనులు ప్రారంభం

చారకొండ, ఫిబ్రవరి 6: మండలంలోని ఎర్రవల్లితండా నుంచి గోకారం వరకు మట్టి రోడ్డు పనులను మంగళవారం ఎర్రవల్లి మాజీ సర్పంచ్ సాయికుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీడీపీ నిధుల నుంచి మట్టి రోడ్డు పనులకు రూ. 4 లక్షలు మంజూరైట్లు తెలిపారు. సంజీవ, రాంపాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి

కల్వకుర్తి, ఫిబ్రవరి 6 : వాహనదారులు, ప్రజలు రోడ్డు భద్రత నిబంధనలను పాటించాలని జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారి ఎర్రిస్వామి కోరారు. కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో ఎంవీఐ రాంబాబు అధ్యక్షతన 37వ జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారి ఎర్రిస్వామి హాజరై మాట్లాడారు. ప్రిన్సిపాల్ శర్వాణి, అధ్యాపకులు మల్లేష్, సైదులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు ఉన్నారు.

రైతులు తమ ఓటును నమోదు చేసుకోవాలి

చారకొండ, ఫిబ్రవరి 6: చారకొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) పరిధిలోని రైతులు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ జెల్లగురువయ్యగౌడ్, పీఏసీఎస్ సీఈవో వెంకటయ్య కోరారు. మంగళవారం పీఏసీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు విలేకరులతో మాట్లాడారు. అర్హులైన రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్‌లతో పాటు రెండు పాస్‌పోర్టు సైజు ఫోటోలు, రూ. 350 నగదును తీసుకొని నేటి నుంచి చారకొండ మండల కేంద్రంలోని పీఏసీఎస్ కా ర్యాలయంలో చెల్లించి సభ్యత్వం నమోదు చేసుకొని ఓటు హక్కును పొందాలని సూచించారు.

'పాత పెన్షన్ విధానం అమలు చేయాలి'

తాడూరు, ఫిబ్రవరి 6 : పాత పెన్షన్ విధానం అమలు చేయాలని టీఎస్‌సీపీఎస్‌ఈయూ జిల్లా అధ్యక్షుడు బీరం అమరేందర్‌రెడ్డి కోరారు. తాడూరు మండల పరిధిలోని ఇంద్రకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న కాంప్లెక్స్ సమావేశాల్లో టీఎస్‌సీపీఎస్‌ఈయూ జిల్లా క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీరం అమరేందర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని 2లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులకు నష్టం కలిగిస్తున్న సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ఏఎంవో షర్ఫుద్దీన్, తాడూరు మండల నోడల్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామీణ పేద యువతకు శిక్షణ

తెలకపల్లి, ఫిబ్రవరి 6 : తెలకపల్లి మండల కేంద్రంలోని మహిళా సమైక్య భవనంలో మంగళవారం రూరల్స్ సెల్ఫ్ ఎంప్లాయిస్‌మెంట్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ద్వారా గ్రామీణ నిరుపేద మహిళలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్ఎస్ఈటీఐ మహబూబ్‌నగర్ డైరెక్టర్ శ్రీనివాసులు, అడిషనల్ డీఆర్‌డీవో లక్ష్మీనారాయణలు హాజరై మాట్లాడారు. డీపీఎంఎస్ వెంకటేశ్, సుధాకర్, అరుణదేవి, ఏపీడీ ఆర్ఎం.మహేందర్‌కుమార్, శ్రీనివాసులు, ఏపీఎం నిరంజన్, ఏపీఎం మల్లేష్, కో ఆర్డినేటర్ చంద్రశేఖర్, జనార్దన్, శిక్షకురాలు ఫరీదాఅతుల్ తదితరులు పాల్గొన్నారు.